క్లుప్తంగా

పాఠశాల ఆకస్మిక తనిఖీ



మోపిదేవి: విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని, మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని పీఎం శ్రీ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ) మల్లంపల్లి సాయిరాం అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తొలుత పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించారు. విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

పెడన: బొల్లా అమ్మన్న సేవా సంఘం అధ్యక్షుడు బొల్లా పాపారావు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని బసవ తేజదుర్గకు ఉచితంగా పుస్తకాలను గురువారం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు శ్రీనివాసరావు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామం చైతన్య నగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ రామయ్య, శాంతమ్మ దంపతులు ఇటీవల ఒకే రోజున మృతి చెందారు. స్థానిక పీఏసీఎస్ చైర్ పర్సన్ ఆది రాంబాబు మృతుల కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. సచివాలయ గ్రామ కన్వీనర్ గౌరం శ్రీనివాసరావు, మోటుపల్లి ప్రభాకరరావు, కొల్లూరి పృథ్వీ, కొల్లూరి రవీంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే విద్యుత్ సర్వీసులు ఇవ్వండి

పెడన: జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వాటికి తక్షణమే విద్యుత్ సర్వీసులు ఇవ్వాలని ట్రాన్స్‌కో మచిలీపట్నం ఈఈ ఎం. భాస్కరరావు అన్నారు. గురువారం ఆయన పెడన ఏఈ జయరాంతో కలిసి మండలంలోని కొంకేపూడి లే అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఎక్కడెక్కడ లే అవుట్లు పూర్తయ్యాయి, ఇళ్లు ఎన్ని నిర్మించుకున్నారు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫారాలు పెట్టింది తదితర విషయాలను ఏఈని అడిగి తెలుసుకున్నారు. ఈఈ మాట్లాడుతూ మచిలీపట్నం డివిజన్ పరిధిలో జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణ శాఖ ఇచ్చిన నివేదికల ప్రకారం 2,500 ఇళ్లు పూర్తికాగా వీటిలో రెండు వేల వరకు విద్యుత్ సర్వీసులను ఇచ్చామని చెప్పారు. జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన వెంటనే సర్వీసులను ఇస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం. భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం మెట్టు, కోతిబొమ్మ సెంటర్, పెడన బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెడన: మండలంలోని జింజేరు గ్రామంలో పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెడన ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం అర్ధరాత్రి దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4,700 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సామూహిక కుంకుమార్చన



కోడూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదాదేవి అమ్మవారికి సామూహిక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గురువారం స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. చిన్నారులు గోదాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదల కాలనీల్లో వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: నగరంలో పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. మూడో డివిజన్ గంగులతోటలో రూ. 36 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ గంగులతోట ప్రాంతంలో అధ్వానంగా ఉండే రహదారిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మెటల్‌రోడ్డుగా అభివృద్ధి చేశారన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఈ రహదారి అభివృద్ధిని పట్టించుకోలేదని చెప్పారు. మళ్లీ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈ రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ శీలం భారతి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ శీలం బాబ్జీ కోరారన్నారు. 48వ డివిజన్ బలరామునిపేటలో రూ. 9 లక్షల వ్యయంతో ప్రాథమిక పాఠశాల వద్ద పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, 3, 48 డివిజన్ల కార్పొరేటర్లు శీలం భారతి, ముచ్చర్ల శైలజ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, కమిషనర్ చంద్రయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు శీలం ఖాను, షేక్ మొహమ్మద్ సాహెబ్, మొహమ్మద్ రఫీ, కార్పొరేటర్లు పరింకాయల విజయ్, తిరుమలశెట్టి ప్రసాద్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

పవనాగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి..

ఇటీవల విడుదలైన చార్టెడ్ ఎకౌంటెంట్ (సీఏ) పరీక్షలో ఉత్తీర్ణుడైన మచిలీపట్నానికి చెందిన ఉదయగిరి పవనాగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. సీఏ పరీక్షలో 21 సంవత్సరాలకే మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణుడైన పవనాగ్‌ను గురువారం ఆయన సత్కరించి మాట్లాడారు. మచిలీపట్నం కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి అంజిబాబు, మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్, ఫ్రెండ్ సర్కిల్ కన్వీనర్ బాలాజీ, వనజ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

తుంగలవారిపాలెం(అవనిగడ్డ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. తుంగలవారిపాలెంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో రోజు రోజుకీ ఆదరణ పెరుగుతోందన్నారు. దీనిని తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీలు అన్నీ ఏకమవుతున్నాయని చెప్పారు. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ కార్యక్రమాలు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే సింహాద్రి చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజాకుమారి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ తుంగల వాసు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ వడ్రే నరేష్, తుంగలవారిపాలెం, వేకనూరు గ్రామ కన్వీనర్లు తుంగల పర్వతాలు, గ్రామ కన్వీనర్ వేణు, నాయకులు తుంగల లక్ష్మీనరసయ్య, గరికపాటి వెంకటేశ్వరరావు, గరికపాటి కృష్ణారావు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



బ్రోచర్ అందజేసి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ

మచిలీపట్నంటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా నగర పాలక సంస్థలో పనిచేస్తున్న 99 మంది పారిశుద్ధ్య కార్మికులకు, 26 మంది అటెండర్లకు, ఇద్దరు స్వీపర్లకు, ముగ్గురు నైట్ వాచ్‌మెన్లకు నూతన వస్త్రాలను, కాస్మోటిక్స్‌ను గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి అందజేశారు. మహిళా కార్మికులకు మూడు జతల చీరలు, మూడు టవల్స్, 12 బట్టల సబ్బులు, నాలుగు లీటర్ల కొబ్బరినూనె, రెండు జతల చెప్పులు, పురుష కార్మికులకు మూడు టవల్స్, ఐదు మీటర్ల ఖాకి క్లాత్, నాలుగు లీటర్ల కొబ్బరినూనె, రెండు జతల చెప్పులు, 12 బట్టల సబ్బులు, అందరికీ యాప్రాన్స్ అందజేశారు.

కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, కమిషనర్ చంద్రయ్య, ఎంహెచ్ఓ వై. బాలసుబ్రహ్మణ్యం, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు శ్రీకాకొళపు రేణుకారాణి, జవ్వాది రాంబాబు, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికురాలికి చీరలు అందజేస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తి

అవనిగడ్డ: స్వామి వివేకానంద జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాలు అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ వివేకానంద జీవిత చరిత్రను, ఆయన సేవలను కొనియాడారు. అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెడ్ పోస్ట్ మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వంగర శేషగిరిరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అంకారావులు వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోస్ట్ మాస్టర్ సింహాద్రి మాట్లాడుతూ వివేకానందుని జీవన విధానం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి వీరకుమారి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు శేషగిరిరావు, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

అవనిగడ్డ: స్థానిక జెడ్పీహైస్కూల్‌లో వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజన దినోత్సవం గురువారం నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి ఎల్ఐసీ ఏఓ పి. లక్ష్మీనారాయణ, హైదరాబాద్ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ ప్రతినిధి పి. సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. టీవీ గిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మచిలీపట్నంటౌన్: స్థానిక లేడియాంప్తిల్ బాలికల జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి ప్రిన్సిపాల్ బనంపూడి ఆనందకుమార్, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనందకుమార్ మాట్లాడుతూ వివేకానందుని బోధనలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరిబాబు, అధ్యాపకులు ఎస్. విజయశ్రీ, మున్వర్, టి. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. వివేకానంద మందిరంలో రామకృష్ణ సమితి ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



లేడియాంప్తిల్ కళాశాలలో వివేకానంద జయంతి వేడుకలు



అవనిగడ్డలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామలింగేశ్వరరావు తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి

పెడన: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో షటిల్ టోర్నమెంట్‌ను స్థానిక గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు టోర్నమెంట్ జరుగుతుందని, విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు పిచ్చుక కోటేశ్వరరావు, యర్రా టార్జన్, మున్నా, మహంకాళరావు తదితరులు పాల్గొన్నారు.

● మోపిదేవి: సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించేందుకు, యువతను మంచిమార్గంలో నడిపేందుకు కబడ్డీ, రంగవల్లి పోటీలు నిర్వహిస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల స్థాయి కబడ్డీ పోటీలు మోపిదేవి జెడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించి వారు మాట్లాడారు. సంక్రాంతి పండుగను ఆహ్లాదకర వాతావరణంలో బంధుమిత్రులతో జరుపుకోవాలని సూచించారు. మొత్తం ఏడు కబడ్డీ టీములు పాల్గొన్నాయని, విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్ నందిగం మేరీరాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, సీఐ భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ పద్మ పాల్గొన్నారు.



షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి

ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసిన జగన్

బంటుమిల్లి: గ్రామ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించారని ఎంపీపీ వి. చినబాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బంటుమిల్లి, పెదతుమ్మిడి వైద్యాధికారులు పవన్‌కుమార్, సువర్చల తమ నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో సిబ్బంది సమయ పాలన పాటించడంలేదని, స్థానికంగా ఉండటంలేదని వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు వైద్యుల దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీపీ చినబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇంటి ముంగిటకు వైద్యం అందించేందుకు ఇద్దరు వైద్యులను, 104 సేవలను అందుబాటులోకి తెచ్చిందని, ఇవి సద్వినియోగం కావాలంటే గ్రామ స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీల పర్యవేక్షణ ఉండాలన్నారు. హౌసింగ్ ఏఈఈ మణికంఠ జగనన్న కాలనీలు, పక్కా గృహాల నిర్మాణాలపై నివేదిక ఇచ్చారు. నాడు–నేడు పనుల మంజూరులో కంచడం ఉన్నత పాఠశాల నమోదు కాకపోవడంపై సర్పంచ్ బి. చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖాధికారి శివరామకృష్ణ మాట్లాడారు. అధికారులు శాఖల వారి నివేదికలు ఇచ్చారు. జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, వైస్ ఎంపీపీ కొల్ల లలిత, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, ఈటీపీఆర్‌డీ రాజేశ్వరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కులు అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఆర్థిక చేయూతను అందించారు. కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పి. రంజిత్‌బాషా చేతుల మీదుగా జర్నలిస్ట్ పిల్లల స్కూల్ ఫీజు నిమిత్తం చెక్కును అందజేశారు. అనంతరం బీఫార్మసీ విద్యార్థికి రూ. 40 వేల విలువ కలిగిన ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. వైద్య సహాయం నిమిత్తం మహిళకు రూ. 43 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్, ప్రాజెక్టు డైరెక్టర్ డానియేల్, సూరత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం

మచిలీపట్నంటౌన్: వ్యవసాయదారులు ఆర్థిక లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని రిజర్వు బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్‌కే హనుమకుమారి అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పట్టాభి ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం ఆర్థిక లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయదారులు, డ్వాక్రా మహిళలు, పెన్షనర్లు, ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున వాటి బారిన పడకుండా ఉండే విధానాలను వివరించారు. పొదుపు ఎలా చేయాలి, అప్పులను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశాలను వివరించారు. కళాజాతా కళాకారులు బుర్రకథ రూపంలో ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ హరిరామ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయిరాం, పట్టాభి డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఆర్డీఓ కిషోర్

చిలకలపూడి(మచిలీపట్నం): కోడిపందేలు, జూదక్రీడలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బందరు ఆర్డీఓ ఐ. కిషోర్ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కోడిపందేలు, జూదక్రీడలు ఎక్కడ జరిగినా తక్షణం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కోడిపందేలు నిర్వహించకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. గతంలో పందేలు నిర్వహించిన వారు, కోడికత్తులు కట్టే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. పందేలు నిర్వహణపై సమాచారం వచ్చిన వెంటనే తక్షణం స్పందించి బరులను తొలగించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ నెల్సన్‌పాల్‌బాబు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిషోర్

చల్లపల్లి: కోడి పందేల నిర్వహణ చట్టరీత్యా నేరమని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ అంధుల సంస్థకు రూ.2 లక్షల విరాళం

పెడన: సెయింట్ విన్సెంట్ పల్లోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు సేకరించి విజయవాడ స్నేహ అంధుల సంస్థకు రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ వంతు సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ రాజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కళలను కాపాడుకోవాలి

నిభానుపూడి(పామర్రు): కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. నిభానుపూడిలో గంగిరెద్దు కళాకారులను ఆయన గురువారం సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ కళాకారులను సహృదయతతో ఆదరించాలని అన్నారు. అనంతరం గంగిరెద్దు కళాకారుడికి ఎంపీపీ శాలువా కప్పి సన్మానించారు.

ఆకట్టుకున్న మైక్రో చిత్ర ప్రదర్శన



మైక్రో చిత్రాలను తిలకిస్తున్న తహసీల్దార్ సునీల్‌బాబు

మచిలీపట్నంటౌన్: ప్రముఖ మైక్రో చిత్రకళాకారుడు గేదెల అప్పారావు గురువారం రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మైక్రో చిత్రప్రదర్శన ఆకట్టుకుంది. బందరు తహసీల్దార్ డి. సునీల్‌బాబు ప్రారంభించి చిత్రాలను తిలకించి అప్పారావును అభినందించారు. ప్రదర్శనలో నువ్వుగింజపై మహాత్మాగాంధీ చిత్రం, కందిబద్దపై మదర్‌థెరిస్సా, దోసగింజపై ఎన్టీ రామారావు పేరును, బీర గింజపై ఏసుప్రభు శిలువను గీచి ప్రదర్శించారు. అప్పారావు మాట్లాడుతూ చిత్రప్రదర్శన ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ ప్రదర్శనను నగరానికి చెందిన పలువురు సందర్శించారు.

వస్త్రదానం

చల్లపల్లి: నిరుపేద ఎస్టీ కుటుంబాల వారికి ప్రహర్ష చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేములపల్లి ఎలైజా పాల్ వస్త్రదానం చేశారు. గురువారం రాత్రి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన మురికివాడలో జీవిస్తున్న నిరుపేద ఎస్టీలు 25 కుటుంబాల వారికి దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవల్స్ అందచేశారు. పాస్టర్ అద్భుతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం





గురువులతో పూర్వ విద్యార్థులు: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించిన చెన్నూరు పూర్వ విద్యార్థులు

చల్లపల్లి: ఇరవై రెండేళ్ల నాటి స్నేహం మళ్లీ పలుకరించింది. చిన్నప్పుడు చదువుకున్న బెంచీలు గుర్తుకు వచ్చాయి. ఆత్మీయత పంచిన స్నేహం మళ్లీ చిగురించింది. స్థానిక ఎస్ఆర్‌వైఎస్పీ జూనియర్ కళాశాలలో 1999–2001 ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక గురువారం ఎస్ఆర్‌వైఎస్పీ కళాశాల ఆవరణలో జరిగింది. ఇక్కడ చదువుకుని వృత్తి, ఉద్యోగాల రీత్యా అనేక ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు మళ్లీ కలిసి తమ చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ పలుకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు తగిరిశ సాంబశివరావు, ఎస్.రామారావు, ఎన్‌వీ నరసింహారావులను, అప్పటి కళాశాల సిబ్బందిని ఘనంగా సన్మానించారు.

పెడన: పెడన మండలం చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 1954 నుంచి 1974 వరకు చదివిన పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక గురువారం జెడ్పీ పాఠశాలలో జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి విరాళాలు ప్రకటించడంతో పాటు డిపాజిట్ల కింద రూ.3 లక్షలు చేశామని పూర్వ విద్యార్థులు బోయిన శివనాగేంద్రం, యర్రంశెట్టి దేవేంద్రప్రసాద్, సత్యనారాయణ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు పంపిణీ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హైజినిక్ కిట్స్, మాస్కులు, స్వెట్టర్లను గురువారం అందజేశారు. స్థానిక వీఆర్వో, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు రమణ సహాయం అందించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, గ్రామ ప్రముఖుడు అరజా కిరణ్ కాంత్, రెడ్ క్రాస్ మండల శాఖ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి



మచిలీపట్నంటౌన్: నోబుల్ కళాశాలలో గురువారం సంక్రాంతి ఉత్సవాలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. రంగవల్లులు, గంగిరెద్దు లాట, గాలిపటాలు, భోగి మంటలు తదితర కార్యక్రమాలతో కళాశాల ఆవరణ సంక్రాంతి శోభను సంతరించుకుంది. సంక్రాంతి విశిష్టతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎస్‌డీ తేజ, కె. శశి, మంజు సాధించారు. అధ్యాపక విభాగంలో పి. కమలకుమారి బృందం, పి. శాంతి బృందం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఎం. గోపీకృష్ణ, ఎం. సుధాకర్, విజయకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే ఎర్నెస్ట్ పర్యవేక్షించారు.